క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత నగర పంచాయతీకి సహకరించాలి

ముమ్మిడివరం: ప్లాస్టిక్ రహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దటానికి అందరూ సహకరించాలని కమిషనర్ జి.లోవరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం శానిటేషన్ సిబ్బంది, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించామన్నారు. రాజకీయ నాయకులు, వ్యాపార సంస్థల యజమానులు తమ ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చదరపు అడుగు ఫ్లెక్సీకి రూ.100 చొప్పున, ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే రూ.2,500 నుంచి 5 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల విజేత కార్తికేయ


కార్తికేయను అభినందిస్తున్న వెంకటేశ్వర కళాశాల యాజమాన్య ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం నన్నయ యూనివర్సిటీలో జరిగిన వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థి గుత్తుల కార్తికేయ యూనివర్సిటీ స్థాయిలో పతకాలు సాధించాడు. వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ, పవర్ లిఫ్టింగ్‌లో తృతీయ స్థానాలతో వెండి, కాంస్య పతకాలు సాధించాడు. కార్తికేయను కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్‌లు ప్రశంసించారు.

జగనన్న కాలనీల్లో చురుగ్గా మెరక పనులు


తాండవపల్లి జగనన్న కాలనీలో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు

అమలాపురం టౌన్: జగనన్న కాలనీల ఏర్పాటులో భాగంగా అమలాపురం పట్టణ లబ్ధిదారుల కోసం రూరల్ మండలం తాండవపల్లి, వన్నె చింతలపూడి, సమనస గ్రామాల్లో సేకరించిన 40 ఎకరాల్లో మట్టితో మెరక చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు బుధవారం పరిశీలించారు. వచ్చే ఉగాది నాటికి మెరక పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ నాయుడు తెలిపారు. అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయం పక్కన మరో 10 ఎకరాల్లో జగనన్న కాలనీ సిద్ధమవుతుందని చెప్పారు.

మహా సౌర యాగంలో ప్రత్యేక పూజలు


భక్తులతో గోపూజ చేయిస్తున్న పురోహితులు

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని విలసవిల్లి రామమందిరంలో చేస్తున్న మహా సౌర యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో బుధవారం పూర్వాభాద్ర నక్షత్ర జాతకులతో మామిడి చెట్టుకు పూజలు చేశారు. నక్షత్ర నవగ్రహ పూజల్లో భాగంగా గోపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధ్యాయునికి సత్కారం

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం కొమరగిరి గ్రామంలో రాజుల మెరక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తి కృపారావును తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం సత్కరించారు. కృపారావు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై కాట్రేనికోన మండలం సాపేవారి పల్లె ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృపారావు అహర్నిశలు కృషి చేశారని గ్రామ పెద్దలు నడింపల్లి విశ్వనాథరాజు అన్నారు. కార్యక్రమంలో పత్తి సత్తిబాబు, పెన్మత్స సుబ్బరాజు, యనమదల శ్రీనివాస్, కర్రి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తాళ్లరేవు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను తహసీల్దార్ ఎస్.పోతురాజు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గౌరవ అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, కేవీపీఎస్ అధ్యక్షుడు విప్పర్తి శ్రీనివాస్, కార్యదర్శి మురాల రాజేష్, గోపాలకృష్ణ, టేకుమూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


ఉప్పంగలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వేసిన జాతీయ ఓటరు దినోత్సవ ముగ్గు


యానాంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి


సీనియర్ సిటిజన్ భాస్కరరావును సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: భూపయ్య అగ్రహారంలో స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతపై సీనియర్ సిటిజన్ ఉప్పుగంటి భాస్కరరావు ప్రసంగించారు. సీనియర్ సిటిజన్లు తమ ఓటు గుర్తింపు కార్డులను ప్రదర్శించారు. ఉప్పుగంటి భాస్కరరావును క్లబ్ తరఫున సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి, పేరి లలిత, వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు దువ్వూరి సుబ్బలక్ష్మి, శిష్టా శ్రీహరి, శ్రీగిరి గోపాలకృష్ణ, గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం లాంటిదని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జీవీ సత్యవాణి పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం జరిగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకూ ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల రాంబాబు, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, నాగశ్రీను, పాఠశాల హెచ్‌ఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

తాళ్లరేవు: జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం ఉప్పంగల పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ శాకా శంకరుడు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనేక మంది బాలికలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల రంగవల్లులు వేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్పంచ్ శంకరుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.వరలక్ష్మి, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాం: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతిఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాల్సిన బాధ్యత ఉందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నేషనల్ ఓటర్ల డే ప్రతిజ్ఞను ఏఈఆర్ఓ, బీఎల్ఓలతో చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బెస్ట్ బూత్‌లెవిల్ ఆఫీసర్ అవార్డును ఎస్.వెంకటేశ్వరరావు(ప్యాడ్కో), బెస్ట్ బీఎల్ఓ సూపర్‌వైజర్ అవార్డును ఎం.శంకర్(సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఆర్ఏఓ ఆఫీస్)కు ఆర్ఏఓ మునిస్వామి అందజేశారు. బీఎల్ఓలు బేతాళం కుమార్, శంకర్, ఎస్‌వీవీ సత్యనారాయణలను సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీలు సత్యనారాయణన్, గణేషన్, సిబ్బంది తిరుకోటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2 నుంచి సర్జికల్ కంటి వైద్య శిబిరం

యానాం: యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ప్రత్యేక సర్జికల్ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి, కారైకల్ తదితర ఆసుపత్రుల నుంచి వచ్చే వైద్యుల బృందం ఉచిత కంటి వైద్య పరీక్షలు, అర్హులైన వారికి కంటి శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. 6వ తేదీన అంధత్వ ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారని చెప్పారు. యానాం ప్రాంతీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెబ్ ఆప్షన్‌కు ఉచిత సహాయ కేంద్రం

అమలాపురం టౌన్: బీఎడ్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు స్థానిక ఎస్‌కేబీఆర్ బీఎడ్ కళాశాలలో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు వీలుగా ఉచిత సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండ్రు శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 25, 26, 27 తేదీల్లో కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్‌ఆప్షన్ కల్పించిందన్నారు. తమ కళాశాలలో ఉచిత వెబ్ ఆప్షన్ నమోదు కేంద్రాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 94900 07058 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మొగళ్లమూరులో కుట్టుమిషన్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా రాణించాలని ఎంపీ అనురాధ అన్నారు. స్నేహిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్వర్ణలత అధ్యక్షతన మొగళ్లమూరులోని ఎంపీ కార్యాలయ ఆవరణలో బుధవారం కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇటీవల మహిళల్లో చైతన్యం బాగా పెరిగిందని, స్వశక్తితో సమాజంలో రాణించడానికి నిరంతరం శ్రమించాలన్నారు. ప్రతి విభాగంలో మహిళలు పురుషులతో పోటీ పడుతున్నారని చెప్పారు. సీఎస్ఆర్ నిధులతో 60 మంది మహిళలకు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్నామన్నారు. కుట్టుమిషన్ తీసుకున్న మహిళలు ఆర్థిక భరోసా సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు. మొగళ్ళమూరు, అల్లవరం, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన మహిళలకు అవకాశం కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రాయుడు విష్ణు, బొమ్ము బాలవేణి, కడలి గంగాచలం, సాధనాల సూర్య వెంకట నాగమణి, నడింపల్లి వెంకట సత్యనారాయణరాజు, ఎంపీటీసీలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్
- పాతయింజరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


పాతయింజరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్

ఐ.పోలవరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నామని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం పాతయింజరం గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను విని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఇన్ని సంక్షేమ పథకాలను ఏకకాలంలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అందుకే ప్రజల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విశేష ఆదరణ కనిపిస్తోందని చెప్పారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆదాయం పడిపోయి, ఆర్థిక సమస్యలు ఎదురైనా ముఖ్యమంత్రి పేదల సంక్షేమ విషయంలో వెనకడుగు వేయకుండా అన్ని సంక్షేమ పథకాలను నిర్ణీత తేదీల్లో అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం సత్తిరాజు, కొండేపూడి కృపావరప్రసాద్, దొమ్మేటి దుర్గాప్రసాద్, మోర్త చిన్నా, పెమ్మాడి బాబూరావు, మెకా రవి, ఏలూరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్


దివ్యాంగులకు మంజూరైన రుణాల చెక్కులను అందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా శాఖ నేషనల్ హేండీ క్యాప్డ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా దివ్యాంగులకు మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మంత్రి విశ్వరూప్ స్థానిక తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్పొరేషన్ ద్వారా దివ్యాంగులకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకూ రుణాలు మంజూరవుతున్నాయన్నారు. దివ్యాంగుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకర్గంలోని చిందాడగరువు గ్రామానికి చెందిన కందేరి వెంకటలక్ష్మి, ఎస్.యానానికి చెందిన సూర్యప్రకాశరావులకు చిరు వ్యాపారాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5 లక్షల రుణాల చెక్కులను మంత్రి అందజేశారు.

పలువురికి మంత్రి విశ్వరూప్ పరామర్శ


మృతుడు రమేష్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ఎంట్రుకోనలో ఇటీవల గుండెపోటుకు గురై ఆకస్మికంగా మృతి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ కార్యదర్శి నార్గన రమేష్ కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. రమేష్ చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. కోడూరుపాడులో ఇటీవల మృతి చెందిన కలగట రమేష్ కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, మాజీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, సాపే సత్యనారాయణ, జల్లి శ్రీను తదితరులున్నారు.

ఉప్పలగుప్తం: మాతృ వియోగంతో బాధపడుతున్న వానపల్లిపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లా నాయుడును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. నాయుడు తల్లి మాణిక్యం ఇటీవల మరణించారు. మంత్రి విశ్వరూప్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మాణిక్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, నల్లా సూర్యప్రకాష్, వెంకట నారాయణ, భైరవస్వామి తదితరులున్నారు.

డిమాండ్ల పరిష్కారం కోరుతూ నిరసన

తాళ్లరేవు: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, అంగన్‌వాడీలకు జాబ్ క్యాలెండర్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

సచివాలయ మండల కన్వీనర్ నియామకం


కోటుం లోవరాజు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ ఉప్పలగుప్తం మండల సచివాలయ కన్వీనర్‌గా కోటుం లోవరాజును నియమించినట్టు మండల పార్టీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల అమలాపురంలో జరిగిన జిల్లా జగనన్న సచివాలయ సదస్సులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర కోఆర్డినేటర్ పుత్తా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేల సమక్షంలో లోవరాజు నియామక పత్రం అందుకున్నారు. అతని నియామకానికి కృషి చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు లోవరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రిపబ్లిక్ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

పాల్గొననున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి


బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సిద్ధం చేసిన రిపబ్లిక్ డే వేడుకల వేదిక

యానాం: స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం 74వ రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించడానికి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 9.40 గంటలకు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.మునిస్వామి జాతీయజెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించనున్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరు కానున్నారు. అనంతరం సాధారణ పోలీసు, రిజర్వుడు బెటాలియన్, హోమ్‌గార్డులు, ఎన్‌సీసీ తదితర విభాగాల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఇప్పటికే త్రివర్ణ పతాకాలతో, రంగురంగుల బెలూన్లతో అందంగా అలంకరించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డంపింగ్ యార్డు ఏర్పాటుపై ఫిర్యాదు


డంపింగ్‌యార్డు వద్దంటూ ఆర్‌ఏఓ మునిస్వామికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

యానాం: గిరియాంపేట, సావిత్రినగర్ గ్రామాల మధ్య యానాం మున్సిపాలిటీ ఏర్పాటుచేస్తున్న డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ సదరు రెండు గ్రామాల నాయకులు బుధవారం ఆర్‌ఏఓ మునిస్వామి, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాలకు ఆనుకుని మడఅడవులు ఉండటం, సముద్రం ఆటుపోటులకు అడవుల్లో ఉన్న దోమలు గ్రామాల్లోకి వెల్లువెత్తడం వల్ల ఇప్పటికే గ్రామస్తులు మలేరియా, డెంగ్యూ వ్యాధులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డు పెడితే మరింత ఇబ్బంది పడతారని, అందుకే ఎవరికీ సమస్య లేనిచోట డంపింగ్ యార్డు పెట్టుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఉచిత శిక్షణ


శిక్షణా తరగతుల వివరాలను తెలుపుతున్న జాషువా

అమలాపురం రూరల్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలోని పరంజ్యోతి పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఇంటర్నేషనల్ కోచ్‌లతో మూడు రోజుల పాటు బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పరంజ్యోతి విద్యా సంస్థల కమిషనర్ జాషువా కొమానపల్లి తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జాషువా మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. క్రీడాపరంగా కోనసీమ గ్రామీణ విద్యార్థులను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తరగతులు ఏర్పాటు చేసినట్లు పరంజ్యోతి స్కూలు ప్రిన్సిపాల్ డానియేల్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్పెయిన్ దేశంలో శిక్షణ పొందే అవకాశాన్ని ఏర్పాటు చేస్తామని జాషువా వివరించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కుచ్చర్ల శ్రీను ఇటీవలే మరణించారు. దీంతో శ్రీను పేరున మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు తదితరులు అతడి భార్య కుమారికి బుధవారం అందజేశారు. బీమా మిగిలిన సొమ్ము మృతుని భార్య కుమారి బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా జమవుతుందని వార్డు పార్టీ ఇన్‌ఛార్జి రాము తెలిపారు. బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వార్డు పార్టీ ఇన్‌ఛార్జి కట్టోజు రాము, పార్టీ నాయకులు ఖ్వాజాబాబు, చిక్కాల రవిశంకర్, జిల్లా వక్ఫ్ బోర్డు మెంబర్ కర్రర్ హుస్సేన్ తదితరులున్నారు.

భారీ ట్యాంకర్ల తరలింపుతో విద్యుత్ కష్టాలు

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- ప్రహసనంగా మారిన తరలింపు


అల్లవరం ప్రధాన రోడ్డుపై వెళుతున్న భారీ ట్యాంకర్

అల్లవరం: అల్లవరం మండలం ఓడలరేవులో చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీ వశిష్ట టెర్మినల్ విస్తరణలో భాగంగా గుజరాత్ రాష్ట్రం వస్తున్న భారీ ట్యాంకర్ల తరలింపు ప్రహసనంగా మారింది. ట్యాంకర్ల ఎత్తు బాగా ఎక్కువగా ఉండడంతో నెలల పాటు ప్రయాణం చేసినా ట్యాంకర్లు గమ్యం చేరడానికి ఎన్నో అడ్డంకులు, అవరోధాలు తలెత్తున్నాయి. ఏడాది క్రితం గుజరాత్ నుంచి వచ్చిన రెండు భారీ ట్యాంకర్లు పేరూరు వైజంక్షన్‌లో పది నెలల పాటు రోడ్డు పక్కన పార్కు చేసి ఉంచారు. మరో రెండు ట్యాంకర్లు నెల రోజుల క్రితం వచ్చాయి. పేరూరు నుంచి ఓడలరేవు చేరడానికి 26 స్పాట్‌లను ఓఎన్జీసీ అధికారులు గుర్తించారు. వీటిలో రోడ్డు మలుపులు, ఇళ్ల, వ్యాపార సముదాయాలు, బడ్డీలు, కరెంట్ స్తంభాలు గుర్తించారు. వీటిని తొలగిస్తేనే గాని భారీ ట్యాంకర్లు వెళ్లడానికి అస్కారం లేదు. ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ స్తంభాలు తొలగించి ట్యాంకర్లు వెళ్లడానికి లైన్ క్లియర్ చేశారు. ట్యాంకర్లు ఎత్తు ఎక్కువగా ఉండడంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు అల్లవరం, దేవగుప్తం, బెండమూర్లంక సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం సైతం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పేరూరు నుంచి బయలుదేరిన భారీ ట్యాంకర్లు బుధవారం ఉదయం గోడిలంక పీహెచ్‌సీకి సమీపంలో పార్కు చేసి ఉంచారు. ట్యాంకర్లు తరలిస్తున్న ప్రతిసారి విద్యుత్ తొలగిస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. ప్రజాప్రయోజనం దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వర్తించవలసిన అధికారులు ప్రైవేటు కంపెనీ అడుగులకు మడుగులు ఎత్తుతున్నారని ఆరోపిస్తున్నారు.